కోహీర్: నీట మునిగిన పంటలను పరిశీలిస్తున్న ఏడీఏ భిక్షపతి, అధికారులు

ఝరాసంగం: ఎల్గోయిలో కూలిన గోడను పరిశీలిస్తున్న ఎంపీడీవో సుధాకర్

పటాన్‌చెరు: పాటి గ్రామ పరిధిలోని సబ్‌స్టేషన్‌లో నిలిచిన నీరు

రామచంద్రాపురం: మైహోమ్ త్రిదాష రేడియల్ రోడ్డులో నిలిచిన వర్షపు నీరు

# ముంచెత్తిన వాన

- జిల్లాలో మూడు రోజులుగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షం
- నీట మునిగిన పంటపొలాలు, కూలిన ఇండ్లు
- చెరువులు, కుంటలకు జలకళ
- ఉప్పొంగి ప్రవహిస్తున్న వాగులు, వంకలు

మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు జిల్లా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బయటకు రావడానికి జంకుతున్నారు. ముసురు వానలతో చాలా చోట్ల మట్టి ఇండ్లు కూలాయి. పంట పొలాలు నీట మునిగి తీవ్ర నష్టం వచ్చేలా ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. రోడ్లన్నీ వరద కాల్వలను తలపించాయి. రోడ్ల పైనుంచి వరద ప్రవాహం కొనసాగుతుండడంతో పలు చోట్ల వాహన రాకపోకలను నిలిపివేశారు. చెరువులు, కుంటలు నిండుకుండలా మారి అలుగులు పారుతున్నాయి. ఎదురెక్కే చేపలను పడుతూ మత్స్యకారులు, ప్రజలు సందడి చేస్తున్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో భూగర్భ జలాలు పెరిగి బోరు బావుల నుంచి నీళ్లు ఉబికి వస్తున్నాయి. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు ఎవరూ బయటకు రావొద్దని, అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

*- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, సెప్టెంబర్ 2*

నిజాంపేట్: వర్షానికి కూలిన ఇల్లు

రాయికోడ్: గుర్కుల వాగును పరిశీలిస్తున అధికారులు

కోహీర్: సత్వార్‌లో కూలిన ఇల్లు

నాగల్‌గిద్ద: ఉమ్లాతండా వాగు దాటుతున్న వాహనదారులు

బొల్లారం: గండిగూడెం మధ్య వర్షానికి రోడ్డుపై విరిగిపడిన చెట్టు

కంది: రహదారిపై బారికెడ్ ఏర్పాటు చేసిన పోలీసులు

రామచంద్రాపురం: జ్యోతినగర్‌లో కూలిపోయిన ప్రహరీని పరిశీలిస్తున్న పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పుల్కల్: వర్షపు నీరు నిలవడంతో గుంతలమయంగా సింగూరు రహదారి

## ప్రశాంతంగా పండుగలు జరుపుకోవాలి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, సెప్టెంబర్ 2: వినాయక నవరాత్రి వేడుకలు, మిలాద్ ఉన్ నబీ వేడుకలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో వివిధ మత సంఘాల నాయకులు, పోలీసు, రెవెన్యూ, విద్యుత్, నీటి పారుదల తదితర సంబంధిత శాఖల అధికారులతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. వివిధ మత సంఘాల నాయకుల అభిప్రాయాలను కలెక్టర్, ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 7 నుంచి 11 రోజుల పాటు జరిగే వినాయక నవరాత్రి వేడుకలు, 17వ తేదీన జరిగే మిలాద్ ఉన్ నబీ వేడుకలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయకుడి విగ్రహాలను వినియోగించేలా అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని సంక్షేమ శాఖల అధికారులను ఆదేశించారు. వినాయ నవరాత్రుల సందర్భంగా ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. రోడ్లపై గుంతలను యుద్ధ ప్రాతిపదికన పూడ్చాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. నిమజ్జన సమయంలో అడుగడుగునా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతరం పర్యవేక్షించాలని ఎస్పీ ఆదేశించారు. వినాయక మండపాల వద్ద ప్రమాదాలు జరగకుండా అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టనున్నట్టు తెలిపారు. అనంతరం మట్టి వినాయక విగ్రహాల ఆవశ్యకతను తెలిపేలా పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఆధ్వర్యంలో రూపొందించిన గోడ పత్రికను ఆవిష్కరించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, అధికారులు పాల్గొన్నారు.

## మంత్రి ఇలాకాలో వైద్యం ఇలాగేనా?

మునిపల్లి పీహెచ్‌సీలో వరండాలో మహిళకు సెలిన్‌బాటిల్ పెట్టిన దృశ్యం

మునిపల్లి, సెప్టెంబర్ 2: వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఇలాకా.. మునిపల్లి పీహెచ్‌సీకి వచ్చే రోగులకు వైద్యులు ఇష్టం వచ్చినట్లు వైద్యం అందిస్తున్నారు. సోమవారం మల్లికార్జునపల్లి గ్రామానికి చెందిన ఓ మహిళ జ్వరంతో బాధపడుతూ దవాఖానకు వచ్చింది. వర్షం పడుతున్నా, చలికి వణుకుతున్నా సిబ్బంది ఆ మహిళను వరండాలోని ఓ బెడ్డుపై పడుకోబెట్టి సెలెన్ బాటిళ్లు పెట్టి వైద్యం అందించారు. దవాఖానలో బెడ్లు ఖాళీగా ఉన్నా వరండాలోనే వర్షం తుంపర పడుతున్నా వైద్యం అందించారని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ విషయమై పీహెచ్‌సీ వైద్యుడు రవిని వివరణ కోరగా తనకు సమాచారం లేదని, ఉన్న రెండు వార్డుల్లో సరిపడా బెడ్లు లేక ఇబ్బందులున్నాయని తెలిపారు. దవాఖానకు వచ్చే రోగులకు వార్డుల్లోనే వైద్యం అందించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

## అధికారులు అప్రమత్తంగా ఉండాలి

అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి

రామచంద్రాపురం, సెప్టెంబర్ 2: భారతీ నగర్ డివిజన్‌కు సంబంధించి అన్ని శాఖల అధికారులు వార్డు కార్యాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం వార్డు కార్యాలయంలో ఆమె అధికారులతో సమీక్ష నిర్వహించారు. రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. డివిజన్ ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించాలన్నారు. వర్షపునీరు రోడ్లపై నిలువకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రీన్‌వేస్ట్‌ని వెంటనే క్లియర్ చేయాలన్నారు. పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అత్యవసరమైతేనే తప్ప ప్రజలు ఇండ్ల నుంచి బయటకు రావొద్దన్ని కోరారు. కార్యక్రమంలో ఏఈ చంద్రశేఖర్, ఏవో రమేశ్‌కుమార్, శానిటరీ సూపర్‌వైజర్ వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

## తెల్లాపూర్ చెరువులపై హైడ్రాకు ఫిర్యాదు

రామచంద్రాపురం, సెప్టెంబర్ 2: తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌ల ఆక్రమణలపై సాగునీటి సంఘం మాజీ చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు వడ్డె నర్సింహులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. సోమవారం హైడ్రా కార్యాలయానికి వెళ్లి అక్కడ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెల్లాపూర్‌లోని మేళ్ల చెరువు, వనం చెరువు, ఉస్మాన్‌నగర్‌లో చెలికుంట, కొల్లూర్‌లో పెద్ద చెరువు, ఈదులనాగులపల్లిలో నాగులకుంట, వెలిమెలలో జంగిల్‌వా నికుంటలో జరిగిన ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ల ఆక్రమణలపై హైడ్రా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్వలాభం కోసం పలు నిర్మాణ సంస్థలకు చెందిన బిల్డర్లు చెరువులు, కుంటల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌ల తోపాటు వరద కాల్వలను కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టి జలవనరులను ధ్వంసం చేయడం జరిగిందని హైడ్రాకు వివరించడం జరిగిందని, ఈ విషయంపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామని అధికారులు చెప్పినట్లు ఆయన తెలిపారు.

## సీసీ రోడ్లకు నిధులివ్వాలి

రామచంద్రాపురం, సెప్టెంబర్ 2: ఆర్సీపురం డివిజన్‌లో సీసీ రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పానగేశ్ జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలిని కోరారు. సోమవారం బల్లియా కార్యాలయంలో కమిషనర్ ఆమ్రపాలిని కలిసి వినతిపత్రం అందజేశారు. పలు కాలనీల్లో సరైన రోడ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. వర్షాల కారణంగా గుంతలమయమైన రోడ్లపై వాహనదారులు ప్రమాదాల భారీన పడుతున్నారని చెప్పారు. స్పందించిన కమిషనర్ సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారని కార్పొరేటర్ తెలిపారు.

## ఆక్రమించిన భూమిని స్వాధీనం చేసుకోవాలి

జిన్నారం, సెప్టెంబర్ 2: గడ్డపోతారం పంచాయతీ అల్లీనగర్ పరిధిలోని సర్వేనంబర్ 27లో ఓ పరిశ్రమ టీఎస్ఐఐసీ ద్వారా ఎకరం స్థలం పొందితే అదనంగా 20 గుంటల భూమిని ఆక్రమించుకుందని మాజీ వార్డు సభ్యుడు బాలుగారి శ్రీనివాస్ తహసీల్దార్ భిక్షపతి దృష్టికి తీసుకొచ్చారు. ఆక్రమించుకున్న భూమి విలువ సుమారు రూ.2కోట్లు ఉంటుందని, విచారణ జరిపి ఆక్రమించుకున్న భూమిని స్వాధీనం చేసుకోవాలని కోరారు.

## ఘనంగా పాలాల అమావాస్య

సిర్గాపూర్, సెప్టెంబర్ 2: పొలాల అమావాస్య పండుగను రైతులు సోమవారం ఘనంగా జరుపుకొన్నారు. సంప్రదాయ పద్ధతిలో ఎడ్లను అందంగా అలంకరించి పూజలు చేశారు. రంగు రంగుల గొండలను కొమ్ములకు ధరించారు. అనంతరం సాయంత్రం ఎడ్లతో స్థానిక హనుమాన్ మందిరం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

## ధరల నియంత్రణలో కేంద్రం విఫలం

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

సంగారెడ్డి కలెక్టరేట్, సెప్టెంబర్ 2: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ధరలను నియంత్రించడంలో విఫలమైందని సీపీఐ నాయకులు మండిపడ్డారు. సీపీఐ జాతీయ కమిటీ పిలుపు మేరకు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. అనంతరం కలెక్టర్ వల్లూరు క్రాంతికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మహబూబ్‌ఖాన్, సీనియర్ నాయకుడు వజీర్‌బేగ్, కార్యవర్గ సభ్యుడు తాజోద్దీన్ రెహమాన్, వినోద, కౌన్సిల్ సభ్యులు షఫీ, రమేశ్, కాశీనాథ్, అనురాధ, శంకరప్ప మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలపై అఘాయిత్యాలు ఎక్కువయ్యాయని, నిరుద్యోగం పెరిగిందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం హైడ్రాను ఏర్పాటు చేసి అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరుగెత్తించడాన్ని సీపీఐ స్వాగతిస్తున్నదన్నారు. అనంతరం సంగారెడ్డిలోని మార్క్స్ నగర్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ముజాహిద్, మల్లేశం, శంకరయ్య, రజియా, శోభ, పోచమ్మ, షాబుద్దీన్, నిర్మల, మల్లమ్మ, యాదమ్మ పాల్గొన్నారు.

## డంపింగ్ యార్డు ఏర్పాటు చేయాలి

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

సంగారెడ్డి కలెక్టరేట్, సెప్టెంబర్ 2: గ్రేడ్ వన్ మున్సిపాలిటీ సంగారెడ్డిలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి మాట్లాడుతూ మున్సిపాలిటీలో దాదాపు రెండు లక్షల మంది నివాసముంటున్నారని, 15 ఏండ్లుగా డంపింగ్ యార్డు లేక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. పట్టణంలో రోజూ 45 నుంచి 50 టన్నుల వరకు చెత్త సేకరిస్తున్నారని చెప్పారు. చెత్త సేకరిస్తున్న ఆటో కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వాలు మారినా డంపింగ్ యార్డు సమస్య పరిష్కారం కావడం లేదని ఆరోపించారు. వెంటనే సంగారెడ్డిలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేయాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. చెత్త ఆటో యూనియన్ నాయకులు లకం దుర్గయ్య, రాజేశ్, మధు, మల్లేశం, రాము, వీరేశం పాల్గొన్నారు.

## బలవంతపు భూసేకరణ ఆపాలి

సంగారెడ్డి, సెప్టెంబర్ 2: ట్రిపుల్ ఆర్‌కు సంబంధించి బలవంతపు భూసేకరణను వెంటనే ఆపాలని, బాధితులకు భూమికి భూమి ఇవ్వాలని సీపీఎం డామాండ్ చేస్తుందని జిల్లా కార్యదర్శి జయరాజు అన్నారు. సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో రైతు, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరై మాట్లాడారు. ట్రిపుల్ ఆర్‌లో భూసేకరణకు రెవెన్యూ అధికారులు ఉత్సాహం చూపుతున్నారని విమర్శించారు. డీపీఆర్ లేకుండా సంగారెడ్డి, అందోల్ ఆర్డీవోలు భూసేకరణ పనులు ప్రారంభించడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. బలవంతంగా భూసేకరణ చేయడం ఆపాలని, రైతులకు నష్టపరిహారం ఎంత ఇస్తున్నారో చెప్పకుండా అధికారులు ఇష్టానుసారంగా సర్వేలు చేయడం సరైందికాదన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం మార్కెట్ ధరకు మూడింతలు అదనంగా నష్టపరిహారం చెల్లించాలన్నారు. భూములు కోల్పోతున్న ప్రతి రైతు కుటుంబానికి ఒక ప్రభుత్వ ఉద్యోగం, 600 గజాల ఇంటి స్థలం ఇవ్వాలని డిమాండ్‌చేశారు. సమావేశంలో వ్యకాస జిల్లా కార్యదర్శి నర్సింహులు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, కృష్ణ పాల్గొన్నారు.

## వాహన దొంగల అరెస్ట్

**25 బైకులు, ఆటో స్వాధీనం**

దొంగతనం వివరాలను వెల్లడిస్తున్న జహీరాబాద్ పట్టణ ఎస్సై కాశీనాథ్

కోహీర్, సెప్టెంబర్ 2: వాహన తనిఖీల్లో ముగ్గురు దొంగలు పట్టుబడ్డారు. జహీరాబాద్ పట్టణ ఎస్సై కాశీనాథ్ కథనం ప్రకారం.. పట్టణంలోని జాతీయ రహదారిపై సోమవారం ఉదయం వాహన తనిఖీలు చేపట్టారు. రాయికోడ్ మండలంలోని శంశోద్దీన్‌పూర్ గ్రామానికి చెందిన వినోద్‌కుమార్, జహీరాబాద్‌కు చెందిన మహమ్మద్ జుబేర్, మహమ్మద్ షఫీ కలిసి జహీరాబాద్ నుంచి హైదరాబాద్ వైపునకు ముగ్గురు వేర్వేరు బైక్‌లపై వెళ్తుండగా అనుమానం రావడంతో వారిని ఆపి విచారించారు. సదాశివపేట, సంగారెడ్డి పట్టణాల్లో 25 బైకులు, ఒక ఆటో దొంగిలించినట్లు ఒప్పుకొన్నారు. వాహనాల విలువ రూ.15 లక్షల వరకు ఉంటుంది. వాహనాలను స్వాధీనం చేసుకొని ముగ్గురిని కోర్టుకు రిమాండ్ చేశారు. దొంగలను పట్టుకున్నందుకు డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, సీఐ శివలింగం పోలీసులను అభినందించారు.

## చేపల వేటతో సందడే సందడి

న్యాల్‌కల్, సెప్టెంబర్ 2: మండలంలోని హద్నూర్ గ్రామ సమీపంలోని పెద్ద చెరువు వరద నీటితో కళకళలాడుతున్నది. రెండు, మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో ఎగువనున్న వాగూవంకల నుంచి వరద బారీగా చెరువులోకి చేరుతున్నది. దీంతో చెరువు అలుగు పొంగిపొర్లుతుండడంతో పరిసర గ్రామాలకు చెందిన ప్రజల చేపల వేటతో సందడిగా మారింది. చెరువులో పెద్దపెద్ద చేపలు వలలకు చిక్కడంతో మత్స్యకారులు, ప్రజలు పండుగ చేసుకున్నారు. కొందరూ చెరువు అలుగుపై నుంచి చేపలు కింద పడడంతో కట్టెలతో కొట్టి పట్టుకుంటుండగా, మరి కొందరూ వలలు వేసి పట్టారు. చెరువులో 5 నుంచి 10 కిలోలకు పైగా చేపలు వలలకు చిక్కడంతో పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు చెరువు వద్దకు వచ్చి కొనుగోలు చేశారు. వరద నీటితో నిండుకుండలా మారిన చెరువు పరిసరాల్లోకి ఎవ్వరిని వెళ్లకుండా ఇరిగేషన్ శాఖ సిబ్బంది కాపలా ఉన్నారు.

## బోర్ల నుంచి ఉబికివస్తున్న నీరు

న్యాల్‌కల్, సెప్టెంబర్ 2: రేజింతల్ శివారులో బోరుబావి నుంచి నీరు ఉబికి వస్తున్నది. రెండు, మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో చెరువులు, కుంటలు, వాగులు, వంకలు పొంగిపొర్లుతుండటంతో భూగర్భ జలమట్టం పెరిగిపోవడంతో నీరు ఉబికి వస్తున్నది. గ్రామానికి చెందిన రైతు దీపక్‌జ్యోషికి చెందిన పొలంలో బోరుబావిలో నుంచి నీరు ఉబికి వస్తోందని, యాసంగి పంటలకు సాగునీటి కొరత ఉండదని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రాజెక్టును పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్ మనోజ్, డిప్యూటీ కలెక్టర్ మాధురి

న్యాల్‌కల్, సెప్టెంబర్ 2: కొత్తూర్(బి) నారింజవాగు ప్రాజెక్టు పరిసర గ్రామాల పరిధిలోని ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని ట్రైనీ కలెక్టర్ మనోజ్, రెవెన్యూ డిప్యూటీ కలెక్టర్ మాధురి అన్నారు. సోమవారం ప్రాజెక్టును పరిశీలించారు. దిగువన కర్ణాటక వైపు పోతున్న వరద నీటిని పరిశీలించారు. ప్రాజెక్టు ఎగువ, దిగువ ప్రాంతాల్లో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, వంకల వద్దకు ప్రజలు వెళ్లవద్దని సూచించారు. కల్వర్టులు, బ్రిడ్జిల పైనుంచి వెళ్తున్న వరద నీటి ప్రవాహాన్ని దాటే ప్రయత్నం చేయవద్దని కోరారు. ఇరిగేషన్ శాఖాధికారులు, సిబ్బంది ఎప్పటికప్పుడు ప్రాజెక్టును సందర్శించి పరిస్థితిని గమనిస్తూ ఉండాలన్నారు. జహీరాబాద్ ఆర్డీవో రాజు, ఇరిగేషన్ శాఖ డీఈఈ వెంకట్రామిరెడ్డి ఉన్నారు.

## నల్లవాగు ప్రాజెక్టుకు భారీ వరద

నిండుకుండలా నల్లవాగు ప్రాజెక్టు

సిర్గాపూర్, సెప్టెంబర్ 2: మధ్యతరహా ప్రాజెక్టు నల్లవాగుకు భారీగా వరద వచ్చి చేరుతున్నది. రెండు రోజులుగా కురిసిన భారీ వర్షానికి సోమవారం ఉదయం వరకు 3,219 క్యూసెక్కుల వరద వచ్చింది. ప్రాజెక్టు ఎగువన సిర్గాపూర్, కంగ్టి, బీదర్ జిల్లాలో కురిసిన వర్షానికి ఒక్క రోజులోనే ఆరు అడుగుల నీటి మట్టం పెరగడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. వానకాలంలో ఇంత పెద్ద వరద రావడం ఇదే మొదటిసారి. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 1,493 అడుగులు కాగా సోమవారం సాయంత్రం వరకు 1491.50 అడుగుల వద్దకు చేరిందని ఇరిగేషన్ ఏఈ సూర్యకాంత్ తెలిపారు.

## ఆదమరిస్తే అంతే..

లక్ష్మీనగర్‌లో శిథిలావస్థకు చేరిన భవంతి

బొల్లారం, సెప్టెంబర్ 2: మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని లక్ష్మీనగర్‌లో పలు ఇండ్లు శిథిలావస్థకు చేరాయి. ఇప్పటికే మల్లన్న బస్తీలో నాలుగు అంతస్తుల శిథిల భవనాన్ని రెవెన్యూ, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు సీజ్ చేసిన సంగతి తెలిసిందే. లక్ష్మీనగర్‌లో పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన ప్రజలు బిక్కుబిక్కుమంటూ శిథిలావస్థకు చేరిన ఇండ్లలో నివసిస్తున్నారు. గతంలో శిథిలావస్థలో ఉన్న ఓ భవనం కూలిన ఘటనలో ముగ్గురు మృతి చెందగా, ఒకరికి కాలు విరిగింది. అన్నీ తెలిసి ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితిలో జీవనం కొనసాగిస్తున్నారు. 40 ఏండ్ల పురాతన ఇంటిలో ఎనిమిది కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. గతంలో కురిసిన వర్షాలకు ఇంటి పెచ్చులు ఊడడమే కాకుండా, స్లాబ్ సైజు చిన్నగా ఉండడంతో పెను ప్రమాదం పొంచి ఉందని ఆందోళన చెందుతున్నారు. మరో భవనం శిథిలావస్థకు చేరి ఖాళీగా ఉండడంతో చుట్టుపక్కల వారు ఆందోళన చెందుతున్నారు. ఆ భవనంలో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని ఆరోపిస్తున్నారు. మున్సిపల్, రెవెన్యూ అధికారులు శిథిలావస్థకు చేరిన భవనాలను గుర్తించి ప్రమాదాల నుంచి కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

## వరద మాటున గరళం

జిల్లెలవాగులోకి రసాయన వ్యర్థాలు

జిన్నారం, సెప్టెంబర్ 2: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పారిశ్రామిక వాడలోని రసాయన వ్యర్థాలు వరద మాటున నీటి వనరుల్లోకి చేరుతున్నాయి. జిల్లెల వాగు కాల్వలోంచి పెద్ద ఎత్తున రసాయన వ్యర్థాలు వరదగా ప్రవహిస్తున్నాయి. భారీ వర్షాల నేపథ్యంలో తహసీల్దార్ భిక్షపతి, ఆర్ఐ జయప్రకాశ్ నారాయణ వావిలాల, ఊట్ల, జిన్నారం, నల్తూరు, గడ్డపోతారం, కిష్టయ్యపల్లి, కొర్లకుంట, శివనగర్, మాదారం గ్రామాల్లోని చెరువులను పరిశీలించారు. ఊట్ల శివారులోని బామన కుంట, పర్షవాని కుంటను ఇరిగేషన్ ఈఈ బీమ్ మత్స్యకారులతో కలిసి పరిశీలించారు.

## వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి

డీఎంహెచ్‌ఓ గాయత్రిదేవికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సంగారెడ్డి, సెప్టెంబర్ 2: మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వరద నీరు ఇండ్లలోకి చేరడంతో ప్రజలకు విష జ్వరాలు ప్రబలకుండా ముందస్తూ వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని కోరుతూ డీఎంహెచ్‌ఓ గాయత్రిదేవికి వ్యకాస నాయకులు వినతిపత్రం అందజేశారు. సోమవారం జిల్లా ప్రభుత్వ దవాఖానాలో డీఎంహెచ్‌ఓను కలిసిన వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహులు వ్యాధులు వ్యాపించకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా నర్సింహులు మాట్లాడుతూ అధిక వర్షాలకు తోడు దోమల బెడద వెంటాడుతున్నదని, అనేక చోట్ల పారిశుద్ధ్య లోపంతో దోమలు, ఈగల బెడదతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండాలన్నారు. డీఎంహెచ్‌ఓను కలిసిన వారిలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కుమార్, కేవీపీఎస్ నాయకుడు మహేశ్ పాల్గొన్నారు.